క్లుప్తంగా

సహకార రంగం పాత్ర కీలకం



సహకార వారోత్సవ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సిబ్బంది

పెద్దాపురం: భారత ఆర్థిక వ్యవస్థలో సహకార రంగం పాత్ర కీలకమైందని పెద్దాపురం డివిజనల్ సహకార అధికారి కె.పద్మ అన్నారు. పెద్దాపురంలో 70వ జాతీయ సహకార వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం సహకార డిప్యూటీ రిజిస్ట్రార్ వి.కృష్ణకాంత్ సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం డీఆర్ పద్మ మాట్లాడుతూ సహకార రంగం పాత్రను వివరించారు. తొలుత పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యాలయ పరిపాలనాధికారి ఏసుబాబు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ చంద్రశేఖరరావు, ఎన్వీ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

రామాలయానికి మైక్‌సెట్ బహూకరణ

సామర్లకోట: పవర గ్రామంలోని రామాలయానికి మైక్‌సెట్‌ను బుధవారం రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అందజేశారు. అన్నవరం దేవస్థానం నుంచి మైక్‌సెట్‌ను ట్రస్టు బోర్డు సభ్యురాలు నేతల వెంకటలక్ష్మి మంజూరు చేయించారు. దాంతో దానిని ఆలయ కమిటీ అధ్యక్షుడు నాగనబోయిన రాజబాబుకు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నేతల హరిబాబు, ఎంపీటీసీ సభ్యుడు నాగనబోయిన రాజబాబు, వీరంరెడ్డి ఆనంద్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష బిల్వార్చన



అయ్యప్పస్వామి విగ్రహాన్ని ఊరేగిస్తున్న మాలధారులు

కొత్తపల్లి: స్థానిక రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయం వద్ద బుధవారం అయ్యప్పస్వామికి లక్ష బిల్వార్చన నిర్వహించారు. ఉదయం స్వామివారి ఉత్సవ విగ్రహాలను కొత్తపల్లి, వాకతిప్ప, కుతుకుడుమిల్లి గ్రామాల్లో రథంలో ఊరేగించారు. రాత్రి ఆలయం వద్ద మందిరాన్ని ఏర్పాటు చేసి స్వామివారి పూజ చేశారు. కొత్తపల్లి మండలం నుంచే కాకుండా పిఠాపురం, గొల్లప్రోలు, కాకినాడ రూరల్ మండలాల నుంచి పూజల్లో పాల్గొన్నారు.

ప్రజారక్షణ భేరికి పయనం

సామర్లకోట: విజయవాడలో జరగనున్న ప్రజారక్షణ భేరి కార్యక్రమానికి సీపీఎం నాయకులు బుధవారం బయలు దేరారు. దీనికి సంబంధించిన వాహనాలను సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కరణం ప్రసాదరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్యాస్, పెట్రోలు, నిత్యావసరాల ధరలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పారిశ్రామిక వేత్తలు, ధనవంతులకు అండగా ఉంటుందన్నారు. సీపీఎం నాయకులు బాలం శ్రీనివాసు, కరణం గోవిందరాజు, నరవ సురేష్, చల్లా మహేష్, దారబాని కృష్ణ, పి.ప్రసాద్, ఎం.బాబూరావు, ఎ.కనకారావు, ఎస్.సత్యనారాయణ, ఫాతిమా పాల్గొన్నారు.

భవిత విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న అధికారులు

కొత్తపల్లి: మండలంలోని ఉప్పాడలో నెంబర్-1 పాఠశాల వద్ద ఉన్న భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాల గల పిల్లలకు బుధవారం మండల విద్యాశాఖ అధికారులు బి.వేణుగోపాల్, పైడిరాజులు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వం అందజేసిన ఈ ట్యాబ్‌లు అంధులు, వినికిడి సమస్య ఉన్నవాళ్లకి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. పాఠశాల హెచ్ఎం స్వర్ణకుమారి, వీఐఆర్టీలు సీహెచ్ లోవరాజు, ఎ.మేరీ పాల్గొన్నారు.

శ్రీపాద శ్రీవల్లభ మహాసంస్థానం వారోత్సవాలు ప్రారంభం

పిఠాపురం: పిఠాపురంలో కొలువై ఉన్న శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానం సనాతన ధర్మ ప్రచార వారోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గొల్లప్రోలు మండలం వన్నెపూడిలో దత్తాత్రేయ స్వామి దేవాలయంలో దత్త బృందం సభ్యులు భజన చేశారు. గురువారం గొల్లప్రోలు మండలం చేబ్రోలులో వేంచేసియున్న సీతారాముల ఆలయంలో చిత్రాడ గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం బృందం కోలాటం, 17న కొత్తపల్లిలో కొలువైన ధర్మశాస్తా ఆలయంలో 108 తులసి మొక్కలతో పూజ, గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో వేంచేసియున్న అపర్ణాదేవి ఆలయంలో కుంకుమ పూజ, 19న పిఠాపురం మండలం పిఠాపురం శ్రీపాద వల్లభ మహా సంస్థానంలో విష్ణు, లలిత సహస్ర నామాలు, 20న మహా సంస్థానంలో గోపూజ, శ్రీపాద అష్టోత్తర శత నామావళి, 21న మహా సంస్థానంలో అనఘాదేవి పూజ నిర్వహించనున్నట్లు తెలిపారు.

సంక్షేమ సారథి సీఎం జగన్

- అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు
- హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు



హుస్సేన్‌పురంలో లబ్ధిదారుల జాబితా బోర్డును ఆవిష్కరించిన దవులూరి దొరబాబు

సామర్లకోట: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందజేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందని, అందుకే తిరిగి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. హుస్సేన్‌పురం గ్రామంలో బుధవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథి దొరబాబు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటా తిరిగి అర్హులకు పథకాలు అందే విధంగా చూస్తున్నారని అన్నారు. సంక్షేమ సారథి సీఎం జగన్‌ను వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. గత ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రిగా చరిత్ర సృష్టించారని తెలిపారు. నవరత్నాలను ప్రకటించి వాటిని అమలు చేశారన్నారు. ఇందులో అత్యంత ముఖ్యమైన అందరికీ ఇళ్లు పథకంలో హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా తనకు రెండు పర్యాయాలు పదవి దక్కడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో 175 స్థానాల్లోనూ విజయ ఢంకా మోగించడం ఖాయమని దొరబాబు దీమా వ్యక్తం చేశారు. పెద్దాపురం నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా స్థానికుడైన తనకు అవకాశం ఇచ్చారని, తనను గెలిపించాలని ఆయన కోరారు. ప్రజా సేవ చేసేందుకే తాను రాజకీయాల్లోకి వచ్చానన్నారు. అనంతరం సచివాలయ పరిధిలో లబ్ధిదారుల జాబితా బోర్డును దొరబాబు ఆవిష్కరించి పార్టీ జెండా ఎగురవేశారు. వలంటీర్లకు కిట్లు పంపిణీ చేశారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, గ్రామ సర్పంచ్ మార్ని నాగమణి, ఎంపీటీసీ సభ్యురాలు కోట వెంకటలక్ష్మి, ఉప సర్పంచ్ యవర్న చంద్రశేఖర్, సొసైటీ అధ్యక్షుడు వీరంరెడ్డి నాని, నాయకులు మార్ని సూర్యారావు, రెడ్డి రాఘవ, తోట సత్తిబాబు, వెంకటరమణ, మండల ఎస్సీ సెల్ కన్వీనర్ అచ్చారావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేద్దాం

పెద్దాపురం: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. స్థానిక మూడో సచివాలయం పరిధిలో 4, 5వ వార్డులకు సంబంధించి వెలమ కల్యాణ మండపంలో, ఆనూరు గ్రామాల్లో ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన జరిగిన సమావేశంలో దొరబాబు మాట్లాడారు. నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిందన్నారు. మంగతాయారు, వైస్ చైర్మన్‌లు నెక్కంటి సాయిప్రసాద్, కనకాల మహాలక్ష్మి, అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలే కాకుండా మరిన్ని పథకాలను ప్రవేశపెట్టి ప్రతి ఇంటికి సంక్షేమాన్ని తీసుకువచ్చిన ఘనత వైఎస్సార్ సీపీకి దక్కుతుందన్నారు.



పెద్దాపురంలో వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరణ

తొలుత పార్టీ జెండా, సంక్షేమం, అభివృద్ధి పథకాల బోర్డును దొరబాబు ఆవిష్కరించారు. మున్సిపల్ మేనేజర్ యు.జ్యోతిరాణి, జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, కౌన్సిలర్లు త్సలికి సత్య భాస్కర్, విడదాసరి రాజా, ఆరెళ్లి వీర్రాఘవులు, గోకేడ అప్పారావు, కో ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, షేక్ రఫీ, తలారి ధర్మేంద్ర, పార్టీ పట్టణ అధ్యక్షులు కాపుగంటి కామేశ్వరరావు, నాగబోయిన రాజుబాబు పాల్గొన్నారు.

పేలిన రిఫ్రిజిరేటర్

త్రుటిలో తప్పిన ప్రమాదం



సామర్లకోట సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఫ్రిజ్ నుంచి వస్తున్న మంటలు

సామర్లకోట: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం లేబర్ విభాగం గదిలో ఉన్న ఫ్రిజ్ పేలిపోయింది. ఒక్కసారిగా మంటలు రావడంతో ఆసుపత్రి ఆవరణ అంతా పొగ కమ్మేసింది. ఈ ఘటనతో రోగులు హడలిపోయారు. ఆ వివరాల్లోకి వెళ్తే.. బుధవారం సామర్లకోట సామాజిక ఆరోగ్య కేంద్రంలో బాంబు పేలిన శబ్దం రావడంతో ఏం జరిగిందో తెలియక రోగులు ఆందోళన చెందారు. ఫ్రిజ్ పేలిపోయినట్లు ఆసుపత్రి సిబ్బంది గుర్తించారు. వెంటనే విద్యుత్తు సరఫరాను నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. అయితే ఆసుపత్రిలో గదులు పొగతో నిండిపోయాయి. రోగులను బయట చెట్ల కిందకు తరలించి పొగ తగ్గిన తరువాత తిరిగి గదుల్లోకి తరలించారు. అప్పటి వరకూ వైద్య సేవలను నిలిపివేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగినట్లు ఎలక్ట్రికల్ సిబ్బంది గుర్తించారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

డీఎస్పీ లతాకుమారి



వేట్లపాలెం గ్రంథాలయంలో పుస్తకాల జాబితాను పరిశీలిస్తున్న డీఎస్పీ లతాకుమారి

సామర్లకోట: పుస్తక పఠనంతో విజ్ఞానం లభిస్తుందని పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం వేట్లపాలెంలో గ్రంథాలయాన్ని ఆమె సందర్శించారు. అక్కడ పుస్తక ప్రదర్శనను తిలకించారు. డీఎస్పీ మాట్లాడుతూ అనేక మంది మేధావులు గ్రంథాలయంలోని పుస్తకాలను చదువుకుని గుర్తింపు పొందారన్నారు. విద్యార్థులు నిరంతరం చదవడం అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు. గ్రంథాలయంలో సభ్యత్వం కలిగి ఉండటం ద్వారా తమకు కావాల్సిన పుస్తకాలను ఇళ్లకు తీసుకువెళ్లి చదువుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. గ్రంథాలయ సేవలను అంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంథాలయాధికారి వెన్న సుమతిదేవి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పాలచర్ల సతీష్, నాయకులు సున్నా వెంకట్రావు, పాలచర్ల రాంబాబు, ఎడ్లపల్లి మంగబ్బాయి తదితరులు పాల్గొన్నారు. అలాగే సామర్లకోట గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని పుస్తకాల ప్రాధాన్యాన్ని వివరించారు. ఈ కార్యక్రమానికి గ్రంథాలయాధికారి బిందిల రత్నమణి అధ్యక్షత వహించారు.

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి

పెద్దాపురం: విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలని పెద్దాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, మండల విద్యాశాఖాధికారి ప్రభాకరశర్మ, వీఆర్‌కే చౌదరి అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు స్థానిక శాఖా గ్రంథాలయంలో బుధవారం స్వాతంత్ర్య సమరయోధుల పుస్తక ప్రదర్శన, దేశభక్తి గీతాలాపన జరిగింది. గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు అధ్యక్షతన జరిగిన సభలో వారు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు అన్ని అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కౌన్సిలర్ విడదాసరి రాజా, కో ఆప్షన్ సభ్యుడు షేక్ రఫీ, గ్రంథాలయాధికారి నాగరాజు మాట్లాడుతూ విద్యార్థికి పుస్తకమే మంచి స్నేహితుడన్నారు. అనంతరం పుస్తక ప్రదర్శనను వైస్ చైర్మన్ సాయిప్రసాద్, ఎంఈఓలు ప్రారంభించారు. మహాత్మా గాంధీ పాఠశాల హెచ్ఎం ఎల్.శివజ్యోతి, బుల్లియ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన



పెద్దాపురం గ్రంథాలయంలో ప్రసంగిస్తున్న సాయిప్రసాద్



ప్రదర్శనలో పుస్తకాలను పరిశీలిస్తున్న విద్యార్థులు

పిఠాపురం: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పట్టణ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు జి.శ్రీనివాస్ హాజరయ్యారు. గ్రంథాలయ విశిష్టతను, మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. విద్యార్థి దశనుంచే ఉన్నత స్థానానికి చేరుకోవడానికి లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలన్నారు. బాదం మాధవరావు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయిని వి.సత్యప్రియ మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచి పుస్తక పఠనం అలవర్చుకోవాలన్నారు. గ్రంథాలయాల్లో లభించే నీతి కథలు, పుస్తకాలను, పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న శిక్షణ

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో ద్వామాలోని 11 జిల్లాలకు చెందిన పీఓ, ఏపీఓలకు శిక్షణ బుధవారం కొనసాగింది. ఈ తరగతులు గురువారంతో ముగుస్తాయి. ఈటీసీ ఫ్యాకల్టీలు శ్రీదేవి, వెంకటేశ్వరరావు, నిహారిక, ప్రసాద్‌లు పలు అంశాలను వివరించారు.

దత్త దీక్ష స్వీకరణ

పిఠాపురం: స్థానిక రాజరాజేశ్వరీ సమేత కుక్కుటేశ్వర స్వామి దేవస్థానంలో ఉన్న స్వయంభూ దత్తాత్రేయ స్వామి సన్నిధిలో బుధవారం ఉదయం దత్తస్వాములు దత్తదీక్షను స్వీకరించారు. వాడ్రేవు శ్రీనివాసరావు శిష్యుడు కోట ఫణీంద్ర శర్మ వారికి దత్తమాలలను ధరింపజేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు ఆచరించి దీక్షను స్వీకరించారు. ఈ కార్యక్రమాలలో ఆలయ చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు, ఈఓ వడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి హామీ నెరవేర్చాం



సంక్షేమ అభివృద్ధి బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



పార్టీ సమకూర్చిన కిట్లను అందిస్తున్న నాయకులు

- వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు సుదర్శన్
- అమీనాబాదులో 'ఏపీకి మళ్లీ జగనే ఎందుకు కావాలి'

కొత్తపల్లి: ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్ అన్నారు. మండలంలోని అమీనాబాదు గ్రామ సచివాలయం-1 వద్ద బుధవారం 'రాష్ట్రానికి మళ్లీ ముఖ్యమంత్రి జగనే ఎందుకు కావాలి' కార్యక్రమాన్ని నిర్వహించారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు పార్టీ సమకూర్చిన కిట్లను పంపిణీ చేశారు. సచివాలయంలో అభివృద్ధి సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం నాయకులతో కలసి ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల బుక్‌లెట్, పార్టీ జెండాను పంపిణీ చేశారు. అనంరతం పల్లెనిద్ర చేసి ప్రజల సమస్యలను, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కుల, మతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తుండడంతో ప్రజలు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి పట్టం కడుతున్నారు. సచివాలయం, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి ఇంటికీ సర్వేచేసి అవినీతికి తావు లేకుండా పాలన సాగుతోందన్నారు. బీసీ కులాలను గత ప్రభుత్వాలు ఓటు బ్యాంక్‌గానే చూసేవని, ఈ ప్రభుత్వం వారి అభివృద్ధికి చర్యలు చేపట్టిందన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలను 90 శాతానికి పైగా పూర్తి చేసి చరిత్రలో నిలచిపోయారన్నారు. ఇప్పటి వరకూ ఏ ప్రభుత్వం కూడా చేనేత కార్మికులను గుర్తించలేదన్నారు. ఇచ్చిన మాట ప్రకారం జగనన్న వైఎస్సార్ నేతన్న నేస్తం పేరుతో అర్హులైన వారికి రూ.24 వేలను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి నక్కా మణికంఠబాబు, మండల సచివాలయ కన్వీనర్ ఉమ్మిడి జాన్, వైఎస్సార్ సీపీ నాయకులు నక్కా తాతారావు పందిరి బాపిరాజు, తొమ్మండ్ర సురేష్ తదితరులు ఉన్నారు.

వైఎస్సార్ సీపీకే మళ్లీ పట్టం

జెడ్పీటీసీ సభ్యుడు నాగలోవరాజు

పిఠాపురం: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ప్రజలు పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని జెడ్పీటీసీ ఉలవకాయల నాగలోవరాజు అన్నారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో ఉన్న గ్రామ సచివాలయం-3 వద్ద బుధవారం రాష్ట్రానికి మళ్లీ ముఖ్యమంత్రి జగనే ఎందుకు కావాలనే కార్యక్రమం నిర్వహించారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు పార్టీ ద్వారా సమకూర్చిన కిట్లను అందజేశారు. సచివాలయంలో అభివృద్ధి సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. పార్టీ జెండాను ఎగరవేసారు. సర్పంచి దొండపాటి లోవతల్లి, ఉప సర్పంచి ఓరుగంటి సూర్యకుమారి, ఎంపీటీసీ ఈసరపు రామకృష్ణ, ఆత్మ చైర్మన్ కడిమిశెట్టి కుమార భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో మండల అభివృద్ధి

ఎంపీపీ కారే సుధ



మండల ఇంజినీర్ శ్రీనివాస్‌ను ప్రశ్నిస్తున్న వైస్ ఎంపీపీ సురేష్ కుమార్

కొత్తపల్లి: అధికారులు, ప్రజా ప్రతినిధుల సమన్వయంతో మండల అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ కారే సుధ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో మండల ఇంజినీరింగ్ అధికారి శ్రీనివాస్ వ్యవహరిస్తున్న తీరు ప్రజా ప్రతినిధులకు అసహనానికి గురిచేస్తోందని, నిర్మాణ పనులకు అంచనాలకు, బిల్లులకు తీవ్ర జాప్యం చేస్తున్నారని వైస్ ఎంపీపీ చెట్టుబత్తిన సురేష్‌కుమార్ పేర్కొన్నారు. అధికారులు ఈ విధంగా వ్యవహరిస్తే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందన్నారు. తాగునీటి సరఫరా కూడా సక్రమంగా లేదని అన్నారు. జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్ మాట్లాడుతూ దాళ్వా వరి సాగుకు సంబంధించి రైతులు డిసెంబరు నెలాఖరు నాటికి నాట్లు పూర్తి చేసుకోవాలి. తద్వారా సాగునీటి ఎద్దడి లేకుండా పంటను పూర్తి చేసుకోవచ్చన్నారు. జిల్లా పరిషత్‌కు సంబంధించి మంజూరైన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఎంపీడీఓ వెంకట నారాయణ మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీ నుంచి గ్రామాల్లో వారం రోజుల పాటు ప్రభుత్వం ఇచ్చిన యాప్‌లో గ్రామ వలంటీర్లు కుల గణన చేపట్టనున్నట్టు తెలిపారు. సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకునేలా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని తీర్మానించినట్టు తెలిపారు. కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ మాదిరెడ్డి దొరబాబు, ఎంపీడీఓ వెంకట నారాయణ, ఈఓ పీఆర్డీ భాస్కరరావు పలు శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

డిసెంబరు 31కి నాట్లు పూర్తి చేయాలి

పిఠాపురం: రబీ సాగుకు డిసెంబరు 31 నాటికి వరి నాట్లు పూర్తి చేయాలని పిఠాపురం వ్యవసాయ శాఖ ఏడీఏ స్వాతి అన్నారు. సాగునీటిపై ఏడీఏ కార్యాలయంలో బుధవారం నీటి పారుదల, వ్యవసాయ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో రబీ సాగుకు సాగునీరు అందించనున్నట్టు తెలిపారు. మార్చి 31 నాటికి రబీ పూర్తయ్యేలా రైతులు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. వెదజల్లు రైతులు డిసెంబరు 5 నాటికి పూర్తి చేసుకోవాలన్నారు. లేదంటే అపరాల సాగుకు రైతులు సిద్ధం కావాలన్నారు. 33 శాతం సబ్సిడీపై అపరాల విత్తనాలు రైతులకు అందివ్వనున్నట్టు తెలిపారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



బాధితులకు సాయం అందజేస్తున్న నాయకులు

కొత్తపల్లి: మండలంలోని నాగులాపల్లి శివారు ఉప్పరగూడెంలో జరిగిన అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలను బుధవారం వైఎస్సార్ సీపీ నాయకుడు వడిశెట్టి నారాయణరెడ్డి పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. 10 కుటుంబాలకు నగదుతో పాటు దుప్పట్లను పంపిణీ చేశారు. పరామర్శించిన వారిలో గుర్రాల చిరంజీవి కుమార్, జక్కి శ్రీనివాసరావు, గుర్రాల యేసేబు, అబ్బిరెడ్డి సుబ్బిరెడ్డి, చింతపల్లి సత్యనారాయణరెడ్డి, అబ్బిరెడ్డి రాముడు, దడాల సత్తిబాబు, గుర్రాల ఆశీర్వాదం, సన్నిబోయిన ఆశీర్వాదం తదితరులు ఉన్నారు.

ఘనంగా ధర్మ ప్రచార వారోత్సవాలు



తూర్పుపాకలలో గరగలకు పూజలు చేస్తున్న భక్తులు

పెద్దాపురం: దేవదాయ శాఖ ఆధ్వర్యంలో సనాతన ధర్మ ప్రచార వారోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. కాండ్రకోట నూకాలమ్మ ఆలయ ఈఓ టీవీ సూర్యనారాయణ, చైర్మన్ గవరసాని వీరస్వామి ఆధ్వర్యంలో తూర్పుపాకల సీతారామస్వామి ఆలయం వద్ద మేళతాళాలు, భజన బృందాలతో గరగల నృత్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో ఆలయాల విశిష్టత, చరిత్ర, హిందూ ధర్మంపై అవగాహన కల్పించారు. దేవస్థాన వేద పండితులు, అర్చక స్వాములతో వేదపారాయణ, సామూహిక కుంకుమ పూజలు, విష్ణు సహస్రనామార్చన, లలితా పారాయణ నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పశువిజ్ఞాన బడి... సరికొత్త ఒరవడి

- పశు పోషణపై రైతుల్లో చైతన్యం
- నెలకు ఒక అంశంపై అవగాహన

మండలం	రైతు భరోసా కేంద్రాలు	గ్రామ పశు కేంద్రాలు	పశు సంపద
పెద్దాపురం	22	14	1,10,390
సామర్లకోట	24	8	1,31,001
మొత్తం	46	22	2,41,391



విజ్ఞాన బడిలో సూచనలిస్తున్న పశు వైద్యాధికారి రాకేష్

పెద్దాపురం: పశు సంపద రక్షణపై పాడి రైతులకు అవగాహన లేక పశు మరణాలు చోటు చేసుకునేవి. పశువులకు తెగుళ్లు సోకితే తెలిసీ తెలియని వైద్య విధానాలతో ఇబ్బంది వచ్చేది. ఈ పరిస్థితుల నుంచి పశు పోషకులను గట్టెక్కించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'పశు విజ్ఞాన బడి' కార్యక్రమాన్ని అమలులోకి తెచ్చింది. ప్రభుత్వం నిర్వహిస్తున్న వైఎస్సార్ పొలం బడి, వైఎస్సార్ తోట బడులు మంచి ఫలితాలను ఇవ్వడంతో పశు విజ్ఞాన బడిని ప్రవేశపెట్టింది. పశు సంవర్థక శాఖ ద్వారా చేపట్టిన ఈ కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తుంది. తద్వారా పశు పోషణలో మెలకువలు, జీవాల పెంపకంపై అవగాహన కల్పిస్తున్నారు. పశువులకు సీజనల్‌గా సోకే వ్యాధులు, లక్షణాలు, నివారణా చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణ ఇస్తున్నారు. పెద్దాపురం నియోజకవర్గంలో సుమారు 11,463 ఆవులు, 45,492 గేదెలు, 33,172 గొర్రెలు, 33,640 మేకలు, 1,20,624 కోళ్లు ఉన్నాయి. పెద్దాపురం, సామర్లకోట మండలాల్లో ప్రతి వారం ఒక గ్రామానికి గ్రామ పశు వైద్య సహాయకులతో పశు వైద్యాధికారి వెళ్లి పశు విజ్ఞాన బడిలో సూచనలు ఇస్తున్నారు.

ప్రధాన అంశాలు ఇవే..

పశు విజ్ఞాన బడిలో ప్రధానం 11 అంశాలపై చర్చించి, వాటిపై అనుమానాలను నివృత్తి చేస్తున్నారు. అలాగే వాటిపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రధానంగా పశు పోషణలో పాటించాల్సిన మెలకువలు, పరిశుభ్రమైన పాల ఉత్పత్తి, ఏడాదికి ఒక దూడ, పశు ఆరోగ్య యాజమాన్యం (హెల్త్ కేర్), సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తారు. పశువులలో తిరిగి పొర్లడం విధానాన్ని తగ్గించడం, చండి కట్టు శాతాన్ని పెంచడం, దూడలలో మరణాల శాతాన్ని తగ్గించడం, పశువులలో పాల జ్వరాలు (కీటోసిస్), జీర్ణక్రియ వ్యాధులను గుర్తించడం, తగ్గించడం చేస్తారు. పశువులకు నట్టల నివారణా మందులను ఎలా పట్టాలి, దీనివల్ల కలిగే ప్రయోజనాలు తెలియజేస్తారు. సంపూర్ణ మేత (రేషన్ బ్యాలెన్సింగ్) పెట్టడం, దాని వల్ల కలిగే ప్రయోజనాలు, గడ్డి పెంపకంపై అవగాహన కల్పిస్తారు.

నిర్వహణ ఇలా..

గ్రామాల వారీగా 18 నుంచి 50 ఏళ్లలోపు ఆసక్తి ఉన్న పశు పోషకులు (ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకందారులు)ను ఎంపిక చేస్తారు. ఇందులో ఒకరు పాడి ఉత్పత్తి చేసే రైతు (ప్రోగ్రెసివ్ ఫార్మర్) ఉండాలి. పశువుల ఆసుపత్రి పరిధిలో కానీ, రైతు భరోసా కేంద్రాల్లో కానీ, పశు పోషకులు సూచించిన ప్రదేశంలో కానీ వారానికోమారు పశు వైద్యులు 'పశు విజ్ఞాన బడి' నిర్వహిస్తారు. నెలకు ఒక అంశంపై అవగాహన కల్పిస్తారు. స్థానికంగా ఉండే అవసరాన్ని బట్టి పశు వైద్య అంశాన్ని ఎంపిక చేసుకుని, అవగాహన కల్పిస్తారు.

అవగాహన కల్పిస్తున్నాం



పశు విజ్ఞాన బడుల ద్వారా పశు పోషకులకు అవగాహన కల్పిస్తున్నాం. ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు ఇస్తున్నాం. పశు విజ్ఞాన బడుల నిర్వహణతో రైతులకు పశుపోషణ పట్ల అవగాహన పెరిగింది. ఇప్పటికే పశు మరణాలు పది శాతం తగ్గాయి. ఖాళీగా ఉన్న గ్రామ పశు వైద్య సహాయకుల భర్తీకి ప్రభుత్వానికి నివేదిస్తాం.

–డాక్టర్ కె.రాకేష్, మండల పశు వైద్యాధికారి, ఆర్బీ పట్నం